
కథ

# జ్ఞాన దీపాలు

మర్ల అప్పారావు



మధ్యాహ్నం రెండయింది. రాజమండ్రి జైలులో శిక్షను అనుభవిస్తున్న శివయ్యవద్దకు అటెండరు వచ్చి నిన్ను జైలరుగారు రమ్మంటున్నారని తీసుకవెళ్లాడు.

"నమస్కారం సార్" అన్నాడు శివయ్య.

"చూడు శివయ్య, నీ సత్ప్రవర్తనకు సంతోషించి శిక్షను 2 సం॥లకు కుదించమని మేము చేసిన సిఫార్సులను ప్రభుత్వం అంగీకరించింది. నిన్ను రేపు విడుదల చేస్తున్నాము. నీలో నిబిడీకృతమై మంచిమనిషి వున్నాడు. ఆ మనిషిని ఉత్తేజితుణ్ణిచేసి ఉత్తమ మార్గాన నడచుకుంటూ నవ్యమైన జీవితాన్ని ఇక నుంచి గడుపుకో" అని జైలరు గోపీనాథ్ చెప్పిన అనునయ వాక్యాలకు శివయ్య ఉబ్బిపోయాడు. "అలాగేసార్, తప్పకుండా, ఇక జైలు గడప తొక్కను" అని శివయ్య సెల్‌లోకి వెళ్లిపోయాడు.

ఆ రాత్రి శివయ్యకు నిద్రపట్టలేదు. భార్య, కూతురు ఎక్కడ వున్నారో తిండి తింటున్నారో లేదో. ఇటువంటి నీచపుపనులు చేస్తూ భార్యాబిడ్డలకు సంఘానికి అన్యాయం చేసిన వాణ్ణయ్యాను. నా అంతట నేను నేరం చెయ్యలేదు. పరిస్థితులు, సంఘవ్యతిరేక శక్తులు నన్ను నేరస్థుణ్ణి చేశాయి. నాకు ఈ సమాజంలో గౌరవం ఉంటుందా! నాకు ఎవరైనా గౌరవప్రదంగా బ్రతికే ఉపాయం చూపించగలరా అని అనుకుంటూ పరిపరివిధాల ఆలోచిస్తూ మగత నిద్రలోకి జారిపోయాడు శివయ్య.

మరునాడు శివయ్యను విడుదల చేశారు. జైలు తలుపులు తెరుచుకున్నాయి. శివయ్య బందిఖానాలోంచి బయట ప్రపంచంలోకి అడుగుపెట్టాడు. అతనికి ఎక్కడకు వెళ్లాలో, ఏపని చేసి బ్రతకాలో, భార్యాబిడ్డలు ఎక్కడవున్నారో, వారిని వెదికి ఒక చోట స్థిరపడి సవ్యమైన రీతిలో సంసారాన్ని ఎలా పోషించుకోవాలో ఈ సమస్యలన్నీ అతనిని కలవరపరుస్తున్నాయి.

వారం రోజులైంది. పట్నం అంతా తిరిగేడు నౌఖరీ కోసం. 'నువ్వేం పని చేసేవాడివి' అని తన పూర్వాపరాలు అందరూ అడిగేవారే. ఏమని జవాబు చెప్పను? అతనికి నిరాశానిస్పృహలు ఆవరించాయి. ఆధారం చూపించే నాథుడే కరువయ్యాడు. తాను కరడుకట్టిన నేరస్థుడు, తన


చేతుల్లో ఎంతమంది ప్రాణాలను కోల్పోయారో, ఎంతమంది సుమంగళుల మంగళ సూత్రాలు తెగిపోయాయో, ఎంతమంది తమ ఆస్తులను కోల్పోయి బికారులయ్యారో, ఇవన్నీ తలచుకుంటుంటే, శివయ్యకు తనమీద తనకే రోత పుట్టింది. అసహ్యం వేసింది. 'ఔను! ఒకసారి నేరస్థుడని ముద్రపడిన తరువాత సంఘంలో తనకు ఎలాంటి స్థానం వుంటుంది? గౌరవంగా బ్రతకడానికి తనకు అవకాశాలు తక్కువ. మళ్లీ యథాప్రకారం నేరాలు చేస్తేనేకాని బ్రతకలేనా! కాని తన సత్ప్రవర్తనకు అధికారులు శిక్షను తగ్గించి విడుదల చేసారే! మళ్లీ నేర జీవితంలో శాశ్వతంగా సంఘానికి, కుటుంబానికి దూరమైపోవడమేగా!' అని పరిపరివిధాల అతని మనసు సాలిగూడులోని ఈగలా ఈ సమస్యలనుండి బయటపడటం ఎలా అని ఆక్రోశిస్తోంది.

ఇంతలో చీకటి పడింది. రెండు రూపాయలు మాత్రం అతని వద్ద వున్నాయి. దగ్గర హోటల్లో రెండు బిస్కట్లు తిని, టీ త్రాగి, బీడి అంటించాడు. రోడ్డువైపు చూస్తున్నాడు. ఒక కలవారి ముత్తైదువు ఒంటినిండా నగలు పెట్టుకుని ఒంటరిగా వెళ్తోంది. ప్రక్క సందులోకి తిరిగింది. జనసంచారం లేదు. ఆమెను అనుసరించి వెనకాలే వెళ్తున్నాడు శివయ్య. కాస్త దగ్గరకు వెళ్లి మెడలోని నెక్లెస్ లాగబోయాడు. ఆమె అతని చేతులు పట్టుకుని "తమ్ముడూ, శివయ్య! నన్నడిగితే నేనిద్దును కదా!" అని శివయ్య వైపు తిరిగి "ఈ ప్రపంచంలో బ్రతకడానికి ఈ నీచనేర బ్రతుకు ఎందుకయ్యా? మూడేళ్ల శిక్ష రెండేళ్లకు కుదించి ప్రభుత్వం వద్దనుంచి అనుమతి సంపాదించి నిన్ను ఈ విశాల విశ్వంలో గౌరవంగా బ్రతకమని చెరనుండి విముక్తి చేసిన జైలరుగారి భార్యనయ్యా నేను. ఇంకా వారం రోజులు కూడా కాలేదు జైలునుంచి విడుదలై ఏమిటి ఈ నీచపు పని మళ్లీ పాపకూపంలోకి పడిపోదామని అనుకుంటున్నావా! ఈ నెక్లెస్ కావాలా తీసుకో అంటూ నెక్లెస్ తీయబోయింది. 'అమ్మా! నువ్వా! నన్ను క్షమించవమ్మా!' అని ఆమె పాదాలు కళ్లకు అద్దుకుంటూ ఆమె పాదాలమీద వాలిపోయాడు. "ఫరవాలేదు శివయ్యా! నువ్వూ మనిషివే. నీలోనూ మానవుడు ఉన్నాడు, పరిస్థితులే నీచేత నేరాలు చేయించాయి. ఆమె ఆటోని పిలిచింది. ఊ, ఎక్కు, నువ్వు నా తమ్ముడివయ్యా!" ఆటో ఆమె ఇంటి ముందు ఆగింది. ఇంతలో జైలరుగారు బయటకు వచ్చారు. శివయ్య పంచప్రాణాలు ఎగిరిపోయాయి. 'అమ్మా! నన్ను రక్షించు తల్లీ! ఇవేవీ వారితో చెప్పకండి. నాకు బుద్ధి వచ్చింది.' 'భయపడకు శివయ్యా, అలాగయితే నిన్నిక్కడకెందుకు తీసుకువస్తాను?' శివయ్య ప్రాణం లేచివచ్చింది.

ఎంత నీచమైన పని తిరిగి ప్రారంభించాను! తన సత్ప్రవర్తను అంతా మిథ్యయేనా! తనను ఈ ప్రపంచంలో ఎవరు నమ్ముతారు! ప్రాణం పోయినా సరే, తిండి లేకపోయినా సరే, ఎన్ని అవాంతరాలు ఎదురైనా సరే ఈ నేర వృత్తిని తిరిగి స్వీకరించను' అని అంటూ నేలమీద మట్టిని తీసుకుని, 'భూమాతా, తల్లీ, దీపికా! మీ సాక్షిగా, నేను ఈ నేర ప్రవృత్తికి, వృత్తికి స్వస్తి చెప్తున్నాను" అంటూ ఆ మట్టిని తలకు పులుముకుని ప్రక్కన వున్న వీధి కుళాయిలో స్నానం చేశాడు. జైలరు గోపీనాథ్, దీపికలు ఆశ్చర్యంతో ఆనందించారు. 'ఇతనిని సంస్కరిద్దామని తీసుకువచ్చావా! సరే నీఇష్టం' అన్నాడు గోపీనాథ్. 'ఇతనికి శిక్ష తగ్గించమని మీరు రికమెండ్ చేశారా, ఇతను మంచి మనిషిగా మారిపోయినట్లేనా' అని ఆమె భర్తకేసి చూసింది. ఇతనికి వచ్చే నెల మా సంస్థ 'వెలుగు' తరఫున సన్మానం, ఇతనిలో సంస్కారం ఉరకలు వేస్తోంది, మా సంస్థ ఇతని పునరావాసానికి తగిన సహాయం చేస్తుంది! అంది ఆమె.

'శివయ్యా నువ్వు చాలా అదృష్టవంతుడవయ్యా, సాధారణంగా నేరజీవితానికి అలవాటు పడి, కష్టానికి ఇష్టపడని నేరస్థులు, బుద్ధి మార్చుకుని, సంస్కారం చెంది సవ్యంగా స్థిరపడటం అసంభవము కాదుకాని అరుదైన విషయం. గోఎహెడ్ దీపికా 'అంటూ గోపీనాథ్ లోపలకి వెళ్లాడు. 'శివయ్యా ఈ వెయ్యి రూపాయలు తీసుకుని స్టూవర్టుపురం వెళ్లి, నీ భార్యాబిడ్డలను తీసుకుని కాకినాడలో అవధాని గారని వున్నారు, పెద్ద కంపెనీ యజమాని, ఆయన నీకు తగిన ఉద్యోగం ఇస్తారు, వెంటనే వెళ్లు. వచ్చే నెల 20 న మా సంస్థ బహిరంగసభ వుంది. దానికి తప్పకరావాలి నువ్వు, దానిలో నీకు ముఖ్య పాత్ర వుంది.' అని అతనికి వెయ్యిరూపాయలిచ్చింది గీపిక.

శివయ్య సంతోషానికి అవధులు లేవు. దీపికగారు వచ్చి తన పగిలిన గుండెను మార్చి కొత్త గుండెను అమర్చినట్లు అతను అనుభూతి పొందాడు. సమాధి అయిన అతని ఆశలను ఏదో ఒక మంత్రశక్తి తిరిగి పునర్జీవింప చేసినట్లయింది. నిండా బురదలో కూరుకుపోయిన అతని అస్తవ్యస్త జీవితాన్ని, ఏదో దైవశక్తి బయటకు లాగి వినూత్నమైన బాటలో నడిపించి సుసంపన్నం చేసినట్లయిందతనికి. అతను సంతోషం, బాధ్యత, ఆశ్చర్యం మొదలైనవన్నీ కలిసిన, ఏదో ఒక అతీతమైన అపూర్వమైన అనురాగ ప్రవంతిలో ఈదుతూ స్వచ్ఛమైన జీవనసింహాసనాన్ని అధిష్ఠించినట్లు పరవశం పొంది దీపిక కాళ్లమీద పడిపోయాడు.




'వెళ్లు శివయ్యా! ఇప్పటికైనా నీలో మార్పు వచ్చింది. అవధానిగారు నీకు సహాయం చేస్తారు' అంది ఆమె. శివయ్య కళ్ల వెంబడి అశ్రుధారలు ఆగకుండా కంటిని, బుగ్గలను, నాసికను, శరీరాన్ని దాటి నేలమీదకు జారుకున్నాయి. అవి ఆనందబాష్పాలు, బాధాతప్త హృదయజలధారలు. అతనిలో పశ్చాత్తాపం, స్థిర సంకల్పం సాగర కెరటాల్లా ఎగసి ఎగసి తీరాన్ని చేరుకుంటున్నట్లు అతని గుండెను తాకుతూ ఉత్తేజితుణ్ణి చేశాయి. నేర జీవిత పాప కూపాన్నుంచి బయటపడి, స్వచ్ఛమైన జీవితాన్ని నాంది పలుకుతున్నందుకు అతను పులకితాంగుడయ్యాడు.



అవధానిగారిని కలుసుకునేందుకు కాకినాడ బస్‌స్టాండుకు బయల్దేరాడు శివయ్య. అక్కడ నరశింహం కన్పించాడు. "శివయ్యా! నీకోసమే చూస్తున్నా. మంచిది రా! శివయ్యా! అలా వెళ్లి మాట్లాడుకుందాం. మళ్లీ సంపన్నజీవితం ప్రారంభించేలా చేస్తాను" అన్నాడు నరసింహం. "అయ్యా మీకు నమస్కారం నన్ను వదిలెయ్యండి. నేను ఆ నేరజీవితాన్ని వదిలేశాను" అన్నాడు శివయ్య. ఓ వెటకారపు నవ్వు నవ్వి, 'శివయ్యా నువ్వు వదిలేద్దామనుకున్నా అది నిన్ను వదలదయ్యా!' అన్నాడు నరశింహం. 'బాబూ నన్ను వదిలెయ్యండి' అని శివయ్య అనగానే 'నీలాంటివాళ్లను చాలామందిని చూశా ఇలాంటి కబుర్లు చాలా విన్నా. వచ్చే 7వ తారీకున మూడుకార్లలో ఒక పెళ్లి పార్టీ, విలువైన నగలతో ఆడవాళ్లు 10 లక్షల కేష్‌తో మగవాళ్లు ఇక్కడనుండి అనకాపల్లి వెళ్తున్నారు. కత్తిపూడి తర్వాత 5వ మైలురాయి వద్ద రాళ్లు, బండలు పెట్టి ఆ కార్లను మావాళ్లు నిలిపివేస్తారు. ఆ నగలను ఆకేష్‌ను, నువ్వు నీ అనుచరులు దోచుకుని పెద్దాపురం పాండవుల మెట్టపైకి వెంటనే వచ్చేయండి. అక్కడ పంచుకుందాం. నీ వాటా లక్షరూపాయిలు, ఒక బంగారు హారం, నువ్వు నీ సంసారం కొంతకాలం హాయిగా బ్రతకవచ్చు' అని బలవంతపెట్టాడు నరసింహం. 'అయ్యా నేను మారిపోయాను. నేరవృత్తికి గుడ్‌బై చెప్పేశాను, నేను పూర్తిగా కొత్తమనిషినైపోయాను, మంచి పౌరుడుగా బ్రతుకుద్యామని నిశ్చయించుకున్నాను. దయచేసి నన్ను వదిలేయండి' అంటూ మరి మాట్లాడానికి నరశింహానికి అవకాశం ఇవ్వకుండా అక్కడనుండి మెరుపులా మాయమయి కాకినాడ బస్ ఎక్కేశాడు. అందరూ ఇంత మంచివాళ్లుగా మారిపోతూంటే, మాబోటిగాళ్ల సంగతేంటి? దేశం ఎటు పోతుంది? అనుకుంటూ ఆశ్చర్యపోవడం నరశింహం వంతు అయింది.

అవధానిగారు శివయ్యను చూసి, చాలా సంతోషించి, దీపికగారు పంపించారంటే తన కంపెనీలో వెంటనే తగిన ఉద్యోగం ఇచ్చాడు. శివయ్య సంతోషానికి అవధులు లేవు. వెంటనే పనిలో చేరాడు. సైకిలు కొనుక్కోమని అడ్వాన్సు కుడా ఇచ్చారు అవధానిగారు. ఒకరోజున సైకిలుమీద వెళ్తూంటే జగన్నాధపురం వంతెన వద్ద, ఒక పోలీసు శివయ్యను గుర్తుపట్టి, 'ఒరేయ్ శివయ్యా నువ్వట్రా, ఎప్పుడు వచ్చావు జైలు నుంచి' అంటూ ఆపేడు. శివయ్య తన కథనంతా చెప్పాడు. రెండురోజుల తర్వాత వచ్చి 'నిన్ను అయ్యగారు రమ్మన్నారంటూ' పోలీసు స్టేషన్కు తీసుకోపోయాడు శివయ్యను. 'ఒరేయి శివయ్యా! విడుదలైన ఖైదీలను ఏ కారణం లేకపోయినా బొక్కలోకి తోసెయ్యకుండా వుండాలంటే, నెలనెలా మాకు కన్పిస్తూ వుండాలికదా! నీకు తెలియందేముంది' అన్నాడు కానిస్టేబుల్ అయ్యగారి ఎదురుగుండా.

"అయ్యా! నేను నేరాలు చేయడం మానివేశాను సార్. నన్ను దయవుంచి వదిలేయండి" అని బ్రతిమాలేడు శివయ్య. "నోరుముయ్యి దొంగనాకొడకా, నాకు కథలు చెప్తున్నావా, నేరాలకు, జైళ్ళకు అలవాటుపడిన శాల్తీవి, నువ్వు మంచివాడుగా మారటమా!" అంటూ వీణ్ణి సెల్‌లోకి తోసెయ్యండిరా అని హుకుం జారీ చేశాడు ఇన్స్పెక్టర్. వీడివన్నీ అబద్ధాలు అని అంటూ, ఆ ధైర్యంతోనే అవధానిగారికి ఫోను చేశాడు. అవధానిగారు వెంటనే వచ్చి 'నేరస్థుడెపుడూ నేరస్థుడుగా వుండిపోడు. ఎస్సైగారూ, వాడిలోనూ మానవత్వం ఉంటుంది. మార్పు వస్తుంది, వాడు కూడా మంచివాడుగా మారుతాడు. ఎటొచ్చి నేరస్థుడు మారటానికి మనం అవకాశం ఇవ్వాలి. సాయపడాలి. శివయ్యను మా సంస్థ 'వెలుగు' దత్తత చేసుకుంటుంది. మా కంపెనీలో ఉద్యోగం ఇచ్చాను. వాణ్ణి వదిలెయ్యండి' అని అవధానిగారు అనునయవాక్యాలతో అనగానే అక్కడ వున్న పోలీసులలో కదలిక వచ్చింది. "క్షమించండి అవధానిగారూ, మీరు నేరస్థులను సంస్కరించి, పునరావాసం కల్పించడంలో చేస్తున్న బృహత్ కార్యక్రమానికి, సేవలకు మా ప్రణామాలు,



శివయ్యను తీసుకువెళ్లండి."

నేరం చట్టవిరుద్ధమని, నేరస్థులు శిక్షింపబడతారని అందరికీ తెలుసు. ఊరికే సరదాకు ఎవరూ హత్యలు కాని, దొంగతనంకాని చెయ్యరు. బ్రతకడానికి ఏ ఆధారం లేకపోవడం, కష్టపడకుండా ధనార్జన అనే దురాశ, సంఘంమీద కసి మొదలగునవి నేరాలకు మూలకారణాలు. నేరాన్ని చట్టం, సంఘం బహిష్కరించాయి. అయితే నేరస్థుని సంస్కరించడానికి గాని, పునరావాసం కల్పించడానికిగాని చట్టం వీలు కల్పించదు. ప్రయత్నించదు కూడా! అది సంఘం పని, సంఘ సంస్కర్తల పని, ప్రభుత్వ బాధ్యత. అందువల్లనే నేరస్థులు నేరస్థులుగానే మిగిలిపోతున్నారు. సమాజానికి, దేశానికి ప్రమాదకరంగా ముద్రపడినవారిని సన్మార్గంలో పెట్టి, సంస్కరించి, పునరావాసం కల్పించే బృహత్ కార్యక్రమం తక్షణ కర్తవ్యం. కేవలం నేరం చేసినవారిని శిక్షించి ఊరుకుంటే, తన బాధ్యత తీరిపోయిందని ప్రభుత్వం భావించి, మాకు వీరితో సంబంధం లేదని సంఘం చేతులు దులుపుకుంటే నేరాలు ఆగవు. చట్టాన్ని మరింత కట్టుదిట్టంగా, కఠినంగా తిరిగి వ్రాయాలని న్యాయశాస్త్ర పండితులు అంటారు. నేరం మనస్తత్వానికి, మానవనాడీ మండలానికి సంబంధించిందని మనస్తత్వ శాస్త్రవేత్తలు చెప్తారు. ఏది ఏమైనా ఇది సమాజానికి, ప్రభుత్వానికి, నేరస్థునికి సంబంధించిందని అనుభవాలలో మునిగి తేలిన తలపండిన పౌరులు నొక్కి చెప్తున్నారు. నేరం ఒక సాంఘిక ఘర్షణ అని అంటారు ప్రఖ్యాత రచయితలు ఇలియట్ మరియు మెడలిక్‌లు. సి.డార్రో అంటాడు నేరాన్ని చట్టం, సంఘంకూడా బహిష్కరించాయి అని' గోడ్డర్డ్ అనే ప్రఖ్యాత రచయిత "Mental Efficiency and levels of Intelligence' అనే తన గ్రంథంలో నేరానికి ప్రధానకారణం మానవుని మనోదౌర్బల్యం అని అంటాడు. ఇతను 4000 బాల నేరస్థుల మీద పరిశోధనలు చేశాడు.

"ఏది ఏమైనా నేరస్థుడు నేరస్థుడుగానే ఉండిపోడు. ఉండిపోనివ్వకూడదు. జనజీవన స్రవంతిలో కలిసి గౌరవంగా బ్రతకడానికి వానికి అవకాశం ఇవ్వాలి. శివయ్యను చూడండి. మరచిపోయిన నేరజీవితవిషకూపంలోకి తిరిగి త్రొయ్యడానికి ఇటు సంఘ వ్యతిరేకశక్తులు అటు రక్షించే యంత్రాంగం ప్రయత్నించితే, తాను చలించక, సంస్కరింపబడే బాటలోనే నిలిచి చివరకు పునరావాసం పొంది, జనజీవన స్రవంతిలో కలిసి ఉత్తమ పౌరుడుగా పునర్జన్మ ఎత్తాడు శివయ్య. సత్ప్రవర్తకులుగా సర్టిఫికెట్ పొందిన ఖైదీలను, పశ్చాత్తాపం పొంది నేరాలకు గుడ్‌బై చెప్పి సవ్యమైన మార్గంలో నడుచుకుంటాం అనే వారిని మా 'వెలుగు' సంస్థ సంస్కరించి పునరావాసం కల్పించడానికి మనస్ఫూర్తిగా ప్రయత్నిస్తుంది. వాళ్లను దత్తత చేసుకునేందుకు కూడా ప్రయత్నిస్తుంది. ఈ బృహత్ కార్యక్రమానికి సమాజం, ప్రభుత్వం సహకరిస్తుందని ఆశిస్తున్నామని 'వెలుగు' రథసారధులు అవధాని, దీపికలు ఆవేశంగా ప్రసంగించారు, ఆవేళ సమావేశంలో శివయ్యను వెయ్యిరూపాయాలు కేష్ బహుమతి, శాలువాలతో సత్కరించారు. ఇలాగే మరికొంతమంది మాజీ నేరస్థులకు బహుమతీ ప్రధానాలయ్యాయి. సభకు అధ్యక్షత వహించిన సాంఘిక జైళ్ల శాఖల మంత్రిగారు తాను ప్రభుత్వంతో సంప్రదించి తగిన చర్యలను సాధ్యమైనంత త్వరలో చేపట్టడానికి ప్రయత్నిస్తానని వాగ్దానం చేశారు.

ఇప్పుడు శివయ్యగారు మాట్లాడుతారు అని అవధానిగారు ప్రకటించగా శివయ్య ప్రారంభించాడు.

"ఔను, నేను నేరం చేశాను. జైలు నుండి విడుదలై బుద్ధి మందగించి తిరిగి నేరం చేయ ప్రయత్నించాను. మాతృ సమానురాలైన ఈ దీపికగారు నా కళ్లు తెరిపించారు. మాజీ నేరస్థులు జనజీవన స్రవంతిలో కలసి ఉత్తమ పౌరులుగా జీవించడానికీ ప్రభుత్వం, సంఘం, చట్టం అవకాశాలు, సౌకర్యాలు కల్పించాలి. నేను బొత్తిగా విద్యాహీనుణ్ణి కాను. దేశంలో వివిధ న్యాయస్థానాలలో ఇంచుమిచు 2.34 కోట్ల కేసులు పెండింగులో వున్నాయి. దేశం మొత్తం మీద విచారణలో వున్న ఖైదీలు ఇంచుమించు 2 లక్షల మంది వున్నారు. వారిమీద ఒక్కొక్కరికి రోజుకు సుమారు 60రూ॥ ఖర్చవుతున్నాయి. ప్రతీయేటా వారిమీద సుమారు 370 కోట్ల రూ॥లు ప్రభుత్వాలకు ఖర్చవుతోంది. ఇటువంటి ఖర్చు ఖైదీల కొరకు భరిస్తూ పోవడం తప్ప ఎవరికీ ప్రయోజనం వుండదు. ఈ డబ్బును నేరస్థుల సంస్కరణకోసం వారి పునరావాసం కోసం, వారికి విద్యను సమకూర్చడం కోసం పెట్టుబడి పెడితే ఇది అందరికీ శ్రేయస్సును సమకూరుస్తుంది. ఇది సాంఘిక సంక్షేమ అభివృద్ధి పథకం. నన్ను మానవుణ్ణిగా మార్చి, నాలోవున్న మానవత్వాన్ని ప్రజ్వలింపచేసిన దీపికగారికి, నేను జనజీవన స్రవంతిలో కలసి గౌరవంగా ఉత్తమ పౌరునిగా బ్రతకడానికి ఆధారం చూపించిన అవధానిగారికి నేనెంతో ఋణపడివున్నాను. వారికి నా సాష్టాంగదండ ప్రణామాలు. వారు నాకు ప్రసాదించిన ఈ వెలుగుబాటలోనే నా బ్రతుకు గడుపుతానని వాగ్దానం చేస్తున్నాను. ఇతర నేరస్థులు కూడా నాలాగే మారాలని వారికి విజ్ఞప్తి చేస్తున్నాను. పుట్టుకతో ఎవరూ నేరస్థులు కారు. నేరస్థులుగా ఎవరూ పుట్టరు' అని ఆవేశంతో శివయ్య ప్రసంగించాడు.




శివయ్య కన్నులు ఆనందపూర్ణ బాష్పాలను వర్షించాయి. అతని హృదయంలో ఒక కాంతిరేఖ ప్రవేశించి అతనిని నూతన, పరిశుద్ధ జీవిత గమనంలో ప్రవేశపెట్టినట్లయింది. అతని చక్షువులలో జ్ఞానదీపాలు తళతళలాడుతూ, నూతన జీవన వికాసానికి మార్గాన్ని చూపిస్తున్నాయి. శివయ్య ఈ జన్మలోనే మరోజన్మ నెత్తేడు. ■